క్లుప్తంగా

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు



మానవపాడు: బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఎస్పీ నాయకుడు మహేష్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



అయిజ: సకాలంలో సీసీరోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఏఈ గోపాల్ కాంట్రాక్టర్లను కోరారు. గురువారం 19వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ శ్యామలి ఆచారితో కలిసి ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులకు ప్రాధాన్యం



మనవపాడు: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తామని డాక్టర్ రిజ్వాన్ తాన్వీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలోని గర్భిణులను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ రక్తనమూనాలు పరిశీలించాలన్నారు. గ్రామాలకు అన్ని రకాల వ్యాధులపై పరీక్షలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, యాకుబ్‌భాషా, మదన్‌మోహన్, సత్యానారాయణ, చంద్రన్న, సంధ్యరాణి, ఏఎన్ఎంలు ఆశలు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



అలంపూర్: పట్టణంలోని వివేకానంద యూత్ సొసైటీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు మండల అధ్యక్షుడు సంజీవనాయుడు గురువారం తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా కామాక్షి, ప్రధాన కార్యదర్శిగా రజినిబాబు, సహాయ కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా సర్వేశ్వరుడు, గౌరవ అధ్యక్షుడిగా పోలీస్ చిన్నయ్య, గౌరవ సలహాదారులుగా నాగమద్దిలేటి, మల్లికార్జున్, నాగమల్లయ్య, రామాంజనేయులు, నాగరాజ్ యాదవ్, వెంకటేష్, హనుమంతరావు, రంగస్వామి, శంకర్, ఈశ్వరయ్య, మహేశ్వర్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులను, మండల కార్యదర్శులను, వలంటరీ సభ్యులను, సభ్యులను ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ



అయిజ: మానవపాడు, క్యాతూరులో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు విష్ణు, హేమమానస అయిజ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు బాధ్యతలు చేపట్టారు. అయిజలో పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన రామలింగారెడ్డి ఉన్నత చదువుల కోసం సెలవులపై వెళ్లారు. కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన స్వరూపారాణి మల్దకల్ మండలానికి రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌గా వెళ్లారు. అనంతరం పీహెచ్‌సి సిబ్బంది వైద్యులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కనీస వసతులు కరవు

- సమస్యల వలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



శిథిలావస్థలో పీహెచ్‌సీ గేటు



మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మల్దకల్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నా సంకల్పంతోనే ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. 20 ఏళ్ల కిందట మండలానికి మంజూరైన పీహెచ్‌సీని మండల కేంద్రానికి గ్రామానికి దూరంగా నిర్మించడంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అసలే అనారోగ్యంతో బాధపడుతుంటే ఉన్న ఆస్పత్రి కూడా శివారులో ఏర్పాటు చేయడంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో సరైన వసతులు లేకపోవడంతో రోగులు ప్రతి నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులు దేనికి ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోగులకు తప్పని తిప్పలు

ఆస్పత్రికి పూర్తిస్థాయిలో ప్రహరీ లేకపోవడంతో ఆవరణలో పశువులు, పందులు, గొర్రెలు సంచరిస్తూ ఆవరణ అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. అదే విధంగా ఆస్పత్రిలో వైద్యసిబ్బందికి సరైన వసతి గదులు లేకపోవడంతో పాటు ప్రసూతిగదిలో కూడా సరైన వసతులు లేకపోవడం గమనార్హం. గదులు లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోనే చెట్ల కింద సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజు ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రహరీగోడ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి.

–బుడ్డన్న, మల్దకల్

గదులను ఏర్పాటు చేయాలి



సరిపడే గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సీజనల్ కాలంలో ఎక్కువ సంఖ్యలో రోగులు ఆస్పత్రికి రావడంతో ఆరుబయట చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

–సవారమ్మ, అమరవాయి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా. ఇటీవలే ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు తీసుకున్నా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– స్వరూపరాణి, డాక్టర్, మల్దకల్

అంబేద్కర్ ఆశయాలు సాధిద్దాం



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధిద్దామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గువ్వలదిన్నెలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలో అత్యంత మేధావిగా అంబేద్కర్ గుర్తింపు పొందారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలను ఇచ్చారని కొనియాడారు. గ్రామానికి చెందిన నర్సింహులు దళితబంధు ద్వారా రూ.10 లక్షలతో ఏర్పాటు చేసుకున్న గేదెల యూనిట్‌తో పాటు రేషన్‌దుకాణం, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచు మహదేవి, మండల అధ్యక్షుడు ఉరుకుందు, ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, డీలర్ హైమావతి, నాయకులు చక్రధర్, గోపాల్ రెడ్డి, కురుమన్న, వెంకన్‌గౌడ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

సాట్స్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే



సాట్స్ చైర్మన్‌కు పూలబొకె ఇస్తున్న ఎమ్మెల్యే

గద్వాల రూరల్: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) చైర్మన్ ఆంజనేయులుగౌడ్ గురువారం హైదరాబాదులోని ఎల్‌బీ స్టేడియంలో ఆంజయనేయగౌడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నియోజవర్గంలోని ఆయా మండలాల నుంచి నాయకులు తరలివెళ్లారు. గద్వాల నుంచి 100 వాహనాలలో బీఆర్ఎస్ నాయకులు వెళ్లారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మందా జగన్నాథ్, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్, శుభాకాంక్షలు తెలిపారు.

అలంపూర్: సాట్స్ చైర్మన్‌గా బాధ్యతులు స్వీకరించిన ఆంజనేయులు గౌడ్‌ను ఎమ్మెల్యే అబ్రహం డాక్టర్ వీఎం అబ్రహం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గట్టు: మండలం కేంద్రంతో పాటు ఆలూరు, మాచర్ల, తప్పెట్లమొర్సు, వివిధ గ్రామాల నుంచి జైనడిగడ్డ యువత సభ్యులు ఆంజనేయగౌడు ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు.

వడ్డేపల్లి: సాట్స్ చైర్మన్ ప్రమాణస్వీకారానికి జెడ్పీటీసీ కాశపోగు రాజు, రవి రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ అనీల్, జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ పల్లయ్యలు తరలివెళ్లారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందు రావు

రాజోళి: పల్లెలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఎంపీడీఓ గోవిందు రావు అన్నారు. గురువారం మండలంలోని తూర్పుగార్లపాడు రైతు వేదికలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు స్వచ్ఛ భారత్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. స్వచ్ఛభారత్‌లో ప్రజలను భాగస్వాములను చేస్తూ తడి , పొడి చెత్త సేకరణపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి చెత్త బుట్టలు అందచేయాలని, ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజా, సర్పంచ్ శేషమ్మ, ఏపీఎం మద్దిలేటి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవా సమితి వసతి గృహం ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సీతారామి రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు ఉపాధ్యక్షుడు బండ్ల రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి, విక్రమ్ సింహా రెడ్డి, సంగాల అయ్యప్ప రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారి వీరభద్రప్పకు గురువారం బ్రహ్మకుమారీస్ క్యాలెండర్‌ను ఆ సంస్థ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజశేఖర్, బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు ఉమాపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు తప్పనిసరి

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జాబ్ కార్డులున్న వారు ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ చెన్నయ్య కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నయ్య మాట్లాడుతూ జాబ్ కార్డుకు ఆధార్ లింకు చేయాలని కోరారు. నర్సరీల్లో వంద శాతం మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, ఏపీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు కంటి వెలుగుపై సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11–00 గంటలకు కంటి వెలుగుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నేడు కంటి వెలుగుపై సమావేశం

పార్టీ బలోపేతానికి కృషి

మల్దకల్: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శేషంపల్లిలో కార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ అభివృద్ధి అందరూ కలిసికట్టుగా పాటుపడాలని కోరారు. అనంతరం గ్రామంలో బూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, దర్శెల్లి, ఆంజనేయులు, నాగరాజు, వెంకటేష్, గోపాల్, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సభ్యులతో నాయకులు

నర్సరీని సందర్శించిన ఎంపీడీఓ



గద్వాల అర్బన్: మండలంలోని శెట్టి ఆత్మకూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం ఎంపీడీవో రవీంద్ర పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీని సందర్శించారు. నాణ్యమైన మట్టిని నింపాలన్నారు. మొక్కలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రేణుక, ప్రభాకర్, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

గద్వాల క్రైం: అనుమతులు లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రేషన్ బియ్యం లారీని అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సివిల్ సప్లయ్ అధికారులు శివలింగం, అలివేలుమంగమ్మ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రామకృష్ణ, సుబ్బన్నలు తెలిపిన కథనం మేరకు గద్వాల ఎంఎల్ఎస్ పాయింటు నుంచి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ధరూర్, మన్నాపురానికి రేషన్ బియ్యం తరలిస్తున్నారు. అయితే పట్టణ శివారులోని రింగ్‌రోడ్డు ప్రాంతంలో ఏపీ 02 టీహెచ్ 1395 గల లారీ అనుమానాస్పందగా నిలిచింది. గమనించిన స్థానిక జర్నలిస్టులు గద్వాల తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ సిబ్బంది సహాయంతో ఆయన లారీని పట్టణ పోలీసు స్టేషన్‌ను తరలించారు. గురువారం విచారణ చేయగా అన్ని అనుమతులతో 584 సంచుల రేషన్ బియ్యంను తరలిస్తునట్లు విచారణలో తేలింది. ఇదిలా ఉండగా ప్రభుత్వ నిబంధనల మేరకు సాయంత్రం 6 గంటలోపు బియ్యంను సరఫరా చేయాల్సి ఉండగా రాత్రివేళలో తరలించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అనుమతులు తీసుకొని రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వడంతో లారీని వదిలిపెట్టినట్లు పట్టణ రెండవ ఎస్ఐ అబ్దుల్‌షకుర్ తెలిపారు.

ఘనంగా గోకరమయ్య ఉర్సు



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

కేటీదొడ్డి: మండల కేంద్రంతో పాటు కుచినెర్ల, నందిన్నె గ్రామాలలో గోకరమయ్య ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వేడుకలు జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాటేళ్లను సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా దాసంగాలు సమర్పించారు. ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్దకల్: మండలంలోని అమరవాయిలో గురువారం గోకరమయ్య ఉర్సు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకు అతీతంగా దర్గా వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచు పద్మమ్మ, ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచు సరోజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోయిల్‌దిన్నె రహదారి

శాంతినగర్: పట్టణం నుంచి కోయిల్‌దిన్నె మీదుగా జాతీయ రహదారి గుండా నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కోయిల్‌దిన్నె సమీపంలోని వాగుపై నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రహదారి పక్కనే లోతైన వాగు ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. శాంతినగర్ నుంచి ఎమ్మెల్యే స్వగ్రామమైన వల్లూరు వరకు ఉన్న రహదారి అడుగడుగునా గుంతలమయంగా దర్శనమిస్తోంది. రోడ్డుపై రాళ్లు, కంకర తేలడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి బాగుచేయించి, కల్వర్టుల వద్ద రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాలలో రికార్డుల తనిఖీ

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతోందని ఎంఈఓ సురేష్ అన్నారు. గురువారం మండలంలోని గంగన్‌పల్లి పాఠశాలను ఎంఈఓ ప్రార్థన సమయానికి చేరుకొని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు–మన బడి పనులపై ఆరా తీశారు. వారి వెంట సీఆర్‌పీ యుగంధర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ సురేష్

ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు



ప్రభుత్వ స్థలంలో బండలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

రాజోళి: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ హెచ్చరించారు. మండలంలోని ముండ్లదిన్నెలో కొందరు వ్యక్తులు 22 సెంట్ల ప్రభుత్వ స్థలంలో హద్దులు ఏర్పాటు చేసి కబ్జా చేశారు. ఈ మేరకు గురువారం ఆయన గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి ప్రభుత్వ స్థలంలో పాతిన బండలను తొలగించారు. ప్రభుత్వ భూమిలో కట్టడాలు, ఇతర ఆక్రమణలకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనువాసులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పింఛన్.. పరేషాన్



తక్కశిలలో పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు

- కంచుపాడులో పింఛన్‌దారుల కష్టాలు
- మూడు కిలోమీటర్లు తప్పని కాలినడక
- పట్టించుకోని అధికారులు

ఉండవెల్లి: ప్రభుత్వం పేదలకు అండగా ఉండేందుకు ఆసరా పింఛన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వివిధ కార్మికులకు పింఛన్ అందజేస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో పింఛన్‌దారుల ఖాతాలో డబ్బులను జమ చేస్తున్నారు. పల్లెలో బ్యాంకు, పోస్టాఫీసు, చిన్నగ్రామాలైతే పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్నారు. కాని తక్కశిలలో పరిస్థితిలో మరోలా ఉంది. పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే బీపీఎం ఇంటికి వెళ్లాల్సిందే. నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ ఇవ్వాల్సి ఉన్నా బీపీఎం మాత్రం నిబంధనలు విరుద్ధంగా పంపిణీ చేస్తున్నారు. ఇంటివద్ద సిగ్నల్ అందక గంటల తరబడి తక్కశీల, కంచుపాడు గ్రామాల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. సిగ్నల్ అందక నానా అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల పింఛన్‌దారులు వాపోయారు.

ఒక్క మిషన్‌తోనే..

కంచుపాడు గ్రామంలో ఉన్న వారికి ఒక మిషన్, తక్కశిల పింఛన్‌దారులకు మరో మిషన్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక మిషన్ సాంకేతికత లోపించడంతో ఉన్న ఒక్క మిషన్‌తోనే రెండు గ్రామాల ప్రజలకు పింఛన్ ఇస్తున్నారు. రెండు గ్రామాలకు వేర్వేరుగా మిషన్లు అందజేసినా బీపీఎం మాత్రం నిబంధనలకు విరద్ధంగా ఒక్క ఊరులోనే రెండు గ్రామాల ప్రజలకు ఇవ్వడం ఏంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పింఛన్ వివరాలు ఇలా..

కంచుపాడు గ్రామ పంచాయతీలో 203, తక్కశిలలో 453 పింఛన్లు ఉన్నాయి. వీరందరికి తక్కశిలలోని బీపీఎం నివాసంలో పింఛన్లను అందజేస్తున్నారు. కంచుపాడు నుంచి తక్కశిలకు మూడు కిలోమీటర్లు కాలినడక వెళ్లలేక వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవిస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామంలో పింఛన్లు ఇవ్వాలని నిబంధనలు ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. గ్రామం నుంచి తక్కశిలకు వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదు. పింఛన్ కోసం గ్రామంలో ప్రత్యేక గది ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం.

– శేషన్ గౌడ్, సర్పంచు, కంచుపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నిబంధనల ప్రకారం లబ్ధిదారుల గ్రామాల్లోనే పింఛన్ ఇవ్వాలి. ఇతర గ్రామాల్లో ఇవ్వొద్దు. కంచుపాడు పింఛన్ లబ్ధిదారులు తక్కశిల గ్రామానికి వెళ్లి పింఛన్ తీసుకుంటునట్లు సమాచారం. ఈ విషయం ఉన్నతాధికారు దృష్టికి తీసుకెళ్లాం.

– ఆంజనేయ రెడ్డి, ఎంపీడీఓ